# నిజం

శ్రీ కప్పగంతుల సత్యనారాయణ

౧

ఆమె,

కొత్తగా కాపురానికి వచ్చింది. కథలలోను, నవలలలోను చదివి, కాపురం అంటే మధురాతిమధురంగా వుంటుం దనుకుంది.

అత్తగారు ఆదరిస్తా రనుకున్నది. ఆడుబిడ్డలు పరిహాసాలాడుతూ, నవ్వుతూ సుఖపెడతా రనుకున్నది. భర్త తనకు అరచేతిలో స్వర్గాన్ని చూపెడుతాడని సుఖస్వప్నాలు కన్నది.

* * *

అతడు,

కష్టపడి చదివాడు. గొప్ప మెప్పుతో పరిక్షప్యాసయినాడు. మంచి ఉద్యోగం దొరుకుతుం దనుకున్నాడు. మెళ్లో పుస్తెలనుకూడా అమ్మితన చదువుకు డబ్బు పంపించిన తల్లినీ, తనకు చిరుగుపంచెలే గతి అయినా కొడుకుదర్జాకు లోటు రాకూడదని తాను తేగలిగిన ప్రతిరాగిదమ్మిడీని పంపించిన తండ్రినీ ఎంతో సుఖపెడదా మనుకున్నాడు. చక్కని చుక్కను పెండ్లి చేసుకొని, 'రాజంటే మరెవడోయ్' అనేపద్ధతిలో బ్రతుకుదా మనుకున్నాడు. తనచదువుకు ఫలితం కలుగుతుందికదా అని ఆశపడ్డాడు.

* * *

ఆమె,

అత్తింటికి వచ్చిననాడే, తన ఆశలన్నీ వొట్టి వనుకున్నది.

'ఇంతషోకులు బోగంవాళ్లకే' అని ఆడుబిడ్డ అన్నమాటకు, అంతరంగంలో పరితపించింది.

'పనీ పాటూ చేతకాని మొద్దు దొరికింది' అని అత్తగారు, తను నేతిగిన్నెను సకాలంలో అందివ్వలేదని తిట్టినతిట్టుకు, తనతల్లిని తలచుకుని మనసులోనే కుమిలింది. రాత్రి పదిన్నరకు గదిలోకి వచ్చి, "మీనాన్న ఇస్తానన్న సైకిలు, ఆయన చచ్చిపోతే మాత్రం, మీ అమ్మ కొనిపెట్టకూడదూ?" అని ఈసడించిన భర్తమార్దవానికి, గుండె గుభేలుమని వెక్కివెక్కి ఏడ్చింది.

* * *

అతడు,

ఎప్పటికేనా ఉద్యోగం దొరకదా అని ఎన్నో రోజులు కనిపెట్టుకున్నాడు. పత్రికలలో పడిన ప్రతి ఎడ్వర్టయిజుమెంటుకూ జవాబు వ్రాశాడు.

ఉద్యోగం ఖాళీవుందన్న ప్రతిఆఫీసుకూ వెళ్లి ఆఖాళీ నింపడానికి తన ఉపయోగం వుంటుందేమోనని విచారించాడు.

ఉద్యోగాలు ఇచ్చే అధికారం గల ప్రతి ఆఫీసరురద్దకూ వెళ్లి అర్థించాడు. చదువుకొనే టప్పుడు, ప్రపంచంలో ఎన్నిరకాల ఉద్యోగా లున్నాయో అతనికి తెలియలేదు కాని ఇప్పు డతనికి బాగా తెలిసింది. అయితే అతనికి ఉద్యోగంమాత్రం దొరకలేదు.

* * *

రోజులు గడచినకొద్దీ ఆమెకు అత్తిల్లు ఒక నరకమైంది.

మంచిగా, స్నేహభావంతో మాట్లాడేవారు ఒక్కరూ ఆయింట్లో ఆమెకు కనపడలేదు.

పైగా, ప్రతివారూ ఏదో సాకుతో, ఏదో ఆరోపణతో ఆమెను ఏదో ఒకవిధంగా బాధించేవారే అయినారు.

ఆమె కూర్చోడం తప్పు; నిలుచోడం తప్పు; పడుకోడంతప్పు; భోజనానికి రావడం తప్పు; రాకపోవడమూ తప్పే. అంతేకాదు; కారణం లేనప్పుడు, ఆమె పనిచెయ్యడంకూడా ఒక అపరాధంగా భా

వించి 'నీకు అక్కరలేనిపని లేదే?' అని అత్తగారు కసరేది.

* * *

కొన్నిచోట్ల అతని బి. ఏ. డిగ్రీ చాలలేదు.

మరికొన్నిచోట్ల అది కేవలం అనవసరమే అయి అపరాధ మైందికూడాను.

ఉద్యోగం లేకుండా ఎన్నోరోజులు తన తల్లి దండ్రుల దగ్గరనే వుండి గడిపాడు.

తన నిరర్థకత్వం, ఊరివారికే కాక, తల్లిదండ్రులకు కూడా మనఃఖేదం కలిగిస్తున్నదని గ్రహించుకున్నాడు.

'పాడయి పట్నం పొమ్మ'న్నసామెత జ్ఞాపకం వచ్చింది.

గాని, ఉద్యోగం వెతకడానికి పట్నం వెడుతున్నానంటే ఎవరూ ఒక్కదమ్మిడీ ఇవ్వరు.

* * *

ఆమెకు ఒకహృదయమూ, ఆత్మ ఉందని ఆమె భర్త ఎన్నడూ అనుకోలేదు. తన నిత్యావసరవస్తువులలో ఆమెకూడా ఒకటి అనుకున్నాడు. అతనికి ఆమె ఉపయోగం అంతే.

అత్త, ఆడుబిడ్డలు- ఆమెను కొనుక్కొకుండా వచ్చిన ఒక బానిస అనుకున్నారు. ఆమె అత్తగారు, తన అత్తగారివల్ల ఇలాటి సుఖాన్నే అనుభవించింది. ఆడుబిడ్డ, తన అత్తగారి ధాటికి తట్టుకోలేకనే, అత్తింటినుంచి పారిపోయివచ్చి పుట్టింటిలో మఠం వేసుకున్నది. వీరిద్దరికీ, కోడలిని సుఖపెట్టడంగాని—అధమం సుఖపడనివ్వడంగాని అంగీకృత మౌతుందా ?

* * *

అతనికి అబద్ధ మాడవలసిన అవసరం వచ్చింది.

"ఉద్యోగం వచ్చింది. చేరడానికి వెడుతున్నాను" అని చెప్పి నూరురూపాయలు అప్పుచేసి, పట్నం బయలుదేరాడు.

పట్నంలో ఎన్నోవృత్తులు వుంటాయి. ఎన్నో ఉద్యోగాలు వుంటాయి. ఎంతోమంది బ్రతుకుతున్నారు. తన కొక్కడికి స్థానం లేకపోతుందా ? తను బ్రతక లేకపోతాడా !

ఆశమీద జీవించడం మనిషికి, శ్రమలేనిపని. ప్రయాణం చేస్తున్నంతసేపూ తాను చెయ్యబోయేపని ఏమై వుంటుందా అన్నఆలోచనే అతనికి.

* * *

ఆమెభర్తకు బ్యాంకిలో పని. చెన్నపట్టణంలో బ్యాంకులు, డబ్బుఇవ్వడం, మూడుగంటలతోనే కట్టి వేస్తాయి. కాని, అధికారంలేని గుమస్తాలు ఇంటికి వెళ్లేటప్పటికి, నగరంలోని తక్కిన ప్రజలంతా భోజనాలు పూర్తిచేసుకొని నిద్రపోతూవుంటారు.

ఆఫీసే జీవితం — ఉద్యోగం చెయ్యడమే పరమార్థంగా గలవాడికి భార్య కష్టసుఖాలుగాని, ఇంట్లో వున్న తక్కిన వారికష్టసుఖాలుగాని ఏమిటో తెలుస్తాయా ? ఇలాటి ఉద్యోగుల జీవితం ఒకమెషీను.

నిద్రలేవడం — ఆఫీసుకు తయారవడం — ఆఫీసుకు వెళ్లడం — ఆఫీసు — ఇంటికి రావడం — పడుకోడం.

* * *

అతడు మదరాసుకు చేరుకున్నాడు. హోటలులో బసపెట్టాడు.

అంతటి మహానగరంలో ఉద్యోగానికి ఎవరి దగ్గరకు వెళ్లాలో అతడికి గ్రాహ్యంకాలేదు.

చేతిలో వున్నడబ్బు జాగ్రత్తగా వాడుకుంటే నాలుగునెలలు వస్తుంది.

నాలుగునెలలలో వుద్యోగం దొరకకపోతుందా?

ఈలోపల ఎంతోమంది పరిచయ మౌతారు. ఎన్నో భోగట్టాలు తెలుస్తాయి.

ఎన్నోఉద్యోగాలు ఖాళీవుంటాయి. అన్నిటికీ తాను అనర్హుడేనా ఏమిటి ? ఏదో దొరుకుతుంది.

* * *

ఆమెజీవితం అలానే చాలారోజులు గడిచింది.

చెన్నపట్టణంలో మొగుడికి ఉద్యోగం అని, ఆమె ఒకప్పుడు పొంగిపోయింది. ఇప్పుడసలీ వుద్యోగం లేకపోతే, భర్తలో కొంతమనుష్యప్రకృతి వుండే

దేమో అనుకున్నది. తనను పంపమని తొందరపెట్టిన అత్తగారికి, తనపైని ఎంత అపేక్ష వున్నదో అనుకున్నదిగాని, అత్తగారి ప్రకృతి ఇలా నేలబెట్టి కాలరాచే స్వభావమని ఆమె కలలోకూడా అనుకోలేదు. ఎన్నోరోజులు గడిచినా, రోజురోజుకూ తన జీవితం మరీ అసహ్యమైపోయిందని ఆమెగ్రహించుకున్నది.

*　　　*　　　*

అతని ఉద్యోగప్రయత్నాలు, అతనికే కాదు, చెన్నపట్టణంలో వున్న ఆఫీసులన్నిటికీ కూడా విసుగు పుట్టించాయి.

ఖాళీలు లేకకాదు. అతడవసరం లేదు. ఏ ఆఫీసులో ఖాళీవచ్చినా, ఆఖాళీని నింపడానికి తగినమనిషి ఎక్కడో ముందుగానే వుండివుంటాడు. కొన్ని సందర్భాలలో ఇలాటి మనిషినిపట్టే, ఖాళీలు ఏర్పడుతాయేమో కూడాను. అతడు చెన్నపట్టణం వచ్చి ఆరునెల్లయింది. రెండు నెలల అద్దె, రెండు నెలలహోటలు బాకీ—అతనికి మదరాసులో లభించిన భాగ్యం.

బాగానే పట్నం వచ్చి పాడయినవారిలో ఇతడొకడు.

*　　　*　　　*

ఇవ్వాళ సుఖంలేకపోయినా, రేపయినా సుఖపడవచ్చునసే ఆశవుంటే ఏ వ్యక్తికయినా జీవితం మీద మోజు వుంటుంది.

నిన్న సుఖపడలేదు. ఇవ్వాళ సుఖంలేదు. రేపు సుఖం వుండదు. అలాటప్పుడు జీవితం అసహ్యమే.

ఆమె కిటికీవద్ద కూచున్నప్పుడల్లా ఇదేఆలోచన.

పనిచేసుకొనే టప్పుడు ఆలోచించడానికి వీలులేదు.

ఎప్పుడేనా కిటికీదగ్గర కూచుంటేనే, ఆలోచన.

ఎదురుగా వున్న బ్రహ్మాండమైన కోనేరును చూస్తూవుంటేనే ఆలోచన. ఆ ఆలోచనకు, ఈకోనేరు పెద్ద ఆధారం.

*　　　*　　　*

అతనికి, చెన్నపట్టణంలో తనకు ఉద్యోగం దొరకదనేమాట రూఢిగా తెలిసిపోయింది.

హోటలువాడు అన్నం పెట్టనన్నాడు. ఇంటియజమాని, అతని రెండుమూడుజతల దుస్తులను తన స్వాధీనం చేసుకుని, అద్దె యిచ్చి పట్టుకొని వెళ్లమన్నాడు.

ఇది అతనికి గొడ్డలిపెట్టు. మింగ మెతుకులేదు. నిలువ నీడలేదు. ఎవరు అన్నం పెడతారు. ఎవరు ఆదరిస్తారు.

సాయంత్రం ఎనిమిది గంటలకు, ఇంటియజమానీ, హోటలువాడూ వెళ్లగొట్టగా అతడు, తనకాళ్లీడ్చుకుపోయిన దారినబడి నడుస్తూ కోనేరు వద్దకు వచ్చాడు.

*　　　*　　　*

ఆమె, ఆ కోనేరువైపు చూస్తూ ఆ కిటికీవద్ద కూచోడంకూడా కొన్నాళ్లకు అత్తగారికీ, ఆడుబిడ్డకూ చాలా పెద్దనేరంగా కనపడింది.

"ఎవరికోసం అలా చూస్తావ్ ?" అని ఆడుబిడ్డ అడిగింది.

" నీవెధవ మొహం చూడటానికి అక్కడికి ఎవరూ రారులే" అని అత్తగారు ఈసడించింది.

ఆమెకు జీవితంలో, ఆనందమూ శాంతీమృగ్యమయాయి.

'ఛీ! వెధవబ్రతుకు' అని నిరాశతో నిట్టూర్పు విడిచింది. కాని, ఈ బ్రతుకునుంచి విడిపడడానికి మార్గం తోచలేదు.

*　　　*　　　*

అతడు ఆ కోనేటిగట్టున కూచుని చాలాసేపు ఆలోచించాడు.

అంతా నిశ్శబ్దంగావుంది. తనకు వెళ్లడానికి ఒక చోటుగాని, వుండడానికి ఒక ఆధారంగాని కనుపడలేదు.

ఆకోనేరు ఒక్కటే అతనికి ఆధారంగా కనుపడింది ఆనిమిషానికి. ఆత్మహత్య చేసుకోడాన్ని గురించి దినాలూ, వారాలూ గడచిపొయ్యేటట్టు ఆలోచించేవారు ఆత్మహత్య చేసుకోలేరు. హఠాత్తుగా ఆత్మహత్యనే తమబాధలకు విముక్తిగాభావించేవారు

ముందువెనుకలు చూడరు. రాత్రిపదిన్నర అయింది. కొద్దిపాటి గలగల చప్పుడుతో అతడు కోనేటిలో కలిసిపోయాడు.

* * *

ఆనాటిరాత్రి ఆమెభర్త ఇంటికి చాలా రాత్రి పోయివచ్చాడు.

ఈలోపల అత్తగారు, ఆమెను ఎన్నో కారణాలకు ఎన్నో తిట్లు తిట్టింది.

"ఇలాటి, ఎందుకూ పనికిరాని బ్రతుకు బ్రతకపోతే ఆకోనేటిలోపడి చావరాదూ? గంటలకొద్దీ ఆ కోనేటివైపుచూస్తావే" అని ఆమెకు అత్తగారు సలహా ఇచ్చింది. ఆమెకు ఈ సలహా, గాఢాంధకారంలో ఒక పెద్ద మెరుపు మెరిసినట్లయింది.

భర్తపడుకున్నాక, చప్పుడుకాకుండా, ముందు వెనుకలుచూడకుండా అర్ధరాత్రివేళ, తనబాధలన్నిటినీ కోనేటిగట్టున వదలి ఆమె కోనేటిలో పడింది.

తెల్లవారేటప్పటికి రెండు శవాలూ, ఒకదాని పక్కన వొకటి కోనేటిలో తేలినవి.

జనం గుంపులు కూడారు. పోలీసులు వచ్చారు. శవాలను తీశారు. విచారణ జరిగింది.

రెండు శవాలు.

స్త్రీ - పురుషుడు.

ఒకరి కొకరికి సంబంధంలేని స్త్రీ పురుషుల శవాలు, ఒక కోనేటిలో, ఒక్కనాడు, ఒకదాని ప్రక్కన ఒకటి తేలడానికి కారణం ఏమిటో!

ఆ ఇద్దరికీ ఏదో సంబంధం వుండి తీరాలన్నారు పంచాయతీదార్లు.

లోకం వెంటనే నమ్మింది.

* * *

అసలు నిజంమాత్రం, ఆకోనేటి గర్భంలో దాగి పోయింది.


## ప్రార్థన గీతావళి

త్రికాలములయందును పఠన చేయుటకు ఉపయోగపడునట్లు ఉపనిషత్తులు మొదలైనవాటినుండి సంకలితము లయిన శ్లోకములు. తాత్పర్యముతోకూడ ప్రకటింపబడినవి.

వెల అ 4/-

ఆంధ్ర గ్రంథమాల, 7, తంబుశెట్టి వీధి, జి. టి. మదరాసు.